

## సరుకు రవాణాలో రికార్డు

**దక్షిణ మధ్య రైల్వే చరిత్రలోనే అత్యధికం**

సిటీబ్యూరో, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ) : దక్షిణ మధ్య రైల్వే ఏర్పడినప్పటి నుంచి సరుకు రవాణా విభాగంలో గత నెలలో అత్యధికంగా 13.122 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేసినట్లు సోమవారం దక్షిణ మధ్య రైల్వే జోన్ అధికారులు తెలిపారు. అలాగే ఎస్‌సీఆర్ రూ.1,296.73 కోట్ల సరుకు రవాణా ఆదాయాన్ని నమోదు చేసిందన్నారు. బొగ్గు, సిమెంట్, ఆహార ధాన్యాలు, ఎరువులు, ఉక్కు కర్మాగారాల కోసం ముడి పదార్థాలు రవాణా చేసినట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు.


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

13 | హైదరాబాద్, మంగళవారం 6 ఫిబ్రవరి 2024 | HYDERABAD




**పట్టాలు ఇవ్వండి..** ▸ కర్మన్‌ఘాట్ జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం నివాసాల్లో అక్రమంగా నివాసం ఉంటున్న వారిని ఖాళీ చేయించి నిజమైన లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వాలని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న బాధితులు








ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్

## డబుల్ డెక్కర్ ఎక్కేద్దాం.. నగరాన్ని చుట్టేద్దాం

**ప్రయాణమంతా ఉచితమే**

**3 రూట్లలో 6 ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సులు**

సిటీబ్యూరో, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): మహానగరానికి ఎంతో అనుబంధం ఉన్న డబుల్ డెక్కర్ బస్సులు కనుమరుగైపోకుండా కేసీఆర్ ప్రభుత్వం హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో 6 ఎలక్ట్రికల్ బస్సులను కొనుగోలు చేసింది. ప్రస్తుతం వీటిని నగరంలో మూడు మార్గాల్లో నగరవాసులు పూర్తిగా ఉచితంగా ప్రయాణం చేసే సౌకర్యం కల్పించింది. హుస్సేన్‌సాగర్ ఇందిరాగాంధీ రోటరీ వద్ద ఉన్న సీవరేజ్ ట్రీట్ ప్లాంట్ నుంచి బస్సులు నిత్యం రాకపోకలు సాగించేలా మార్గాలను ఖరారు చేశారు. ఇందులో మొదటి రూట్‌ను నెక్లెస్ రోడ్డు నుంచి హైటెక్ సిటీ, బయోడైవర్సిటీ, గచ్చిబౌలి, విప్రో జంక్షన్ మీదుగా వేవ్ రాక్ వరకు, అదేవిధంగా రెండవ రూట్‌ను చార్మినార్ వరకు, మూడవ రూట్‌ను ట్యాంక్‌బండ్ చుట్టూ నడుపుతున్నారు.

## 18 ఫోన్ కాల్స్.. 188 దరఖాస్తులు

**ప్రజావాణిలో వినతులు వెల్లువ**

సిటీబ్యూరో, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ) : జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ రొనాల్డ్ రాస్ పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు ఆరు జోన్ల పరిధి నుంచి మొత్తం 188 దరఖాస్తులు వచ్చాయి. కమిషనర్ ఫోన్ ఇన్ ద్వారా 18 కాల్స్ తీసుకున్నారు. ప్రధాన కార్యాలయంలో 56 ఫిర్యాదులు, జోనల్, సర్కిల్ కార్యాలయాలు కలిపి 132 ఫిర్యాదులు వచ్చాయి. అధికంగా టౌన్‌ప్లానింగ్ సంబంధించినవే ఎక్కువగా వచ్చాయి. ప్రజావాణిలో వచ్చిన విన్నపాలను నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాలని మేయర్, కమిషనర్ అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి మెసేజ్ అర్జీదారునితో పాటు సంబంధిత శాఖ హెచ్‌వోడీకి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని, అలాగే పరిష్కరించిన వాటి నివేదికను శనివారం లోపు అందజేయాలని మేయర్ కోరారు. అలాగే ప్రజావాణి ఫిర్యాదులు ఎన్ని రోజుల్లో పరిష్కారం అవుతుందో అర్జీదారునికి లిఖిత పూర్వకంగా తెలియజేయాలని కమిషనర్ చెప్పారు. సర్కిల్ జోనల్ స్థాయిలో సమస్య పరిష్కారం జరగని వారు మాత్రమే హెడ్ ఆఫీస్‌కు రావాలని, ఒకే సమస్యపై రెండోసారి అర్జీ సమర్పిస్తే అధికారులపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.



జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులుస్వీకరిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ రొనాల్డ్ రాస్ తదితరులు

## 17 మంది సీఐలు బదిలీ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ) : నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో 17 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వారం రోజుల క్రితం బదిలీ అయిన ఇద్దరిని తిరిగి అదే పోస్టులకు నియమించగా మరొకరిని సీసీఎస్ నుంచి వెస్ట్‌జోన్ పీసీఆర్‌కు బదిలీ చేశారు. వీరితో పాటు మల్టీజోన్-2 నుంచి వచ్చిన 7 మందికి వివిధ ఠాణాలలో ఎస్‌హెచ్‌వో, డీఐలుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మరో 7 మందిని మల్టీజోన్-2కు సరెండర్ చేశారు.



కౌన్సిల్ ఏర్పాటుపై సెక్రటరీ లక్ష్మితో చర్చిస్తున్న మేయర్ విజయలక్ష్మి

## కౌన్సిల్ ఏర్పాటులో జాప్యమెందుకు?

**పురపాలక శాఖ, జీహెచ్‌ఎంసీని ప్రశ్నించిన హైకోర్టు**

**12న సమగ్ర వివరాలతో విచారణకు హాజరుకావాలని ఆదేశం**

**నేడు అన్ని పార్టీల కార్పొరేటర్లతో మేయర్ అత్యవసర సమావేశం**

**అసెంబ్లీ తర్వాత ఏర్పాటు దిశగా చర్యలు?**

సిటీబ్యూరో, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ) : జీహెచ్‌ఎంసీ సర్వసభ సమావేశ ఏర్పాటుపై ఎట్టకేలకు కదలిక వచ్చింది. ప్రజా సమస్యలపై చర్చించేందుకు వేదికైన కౌన్సిల్‌ను ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించాల్సిన ఉన్నా గడిచిన ఐదున్నర నెలలుగా నిర్వహించలేదు. తొలుత అసెంబ్లీ ఎన్నికల కోడ్ కారణంగా వీలు కాలేదు. గడిచిన రెండు నెలలుగా కౌన్సిల్ ఏర్పాటుకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ ప్రభుత్వ నోటీసులో పెట్టి సర్వసభ్య సమావేశం నిర్వహించాల్సి ఉన్నా ఆ దిశగా నిర్ణయం తీసుకోలేదు. పలుమార్లు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సూచించినా కమిషనర్ స్పందించలేదు. బీజేపీ కార్పొరేటర్లూ కమిషనర్‌ను కలిసే ప్రయత్నం చేసినా వారికి సమయం ఇవ్వలేదు. దీంతో కౌన్సిల్ ఏర్పాటులో ఆలస్యానికి కమిషనర్ వైఖరే కారణమని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. మరోపక్క బీజేపీ మల్కాజ్‌గిరి కార్పొరేటర్ శ్రవణ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటుపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు న్యాయస్థానంలో సోమవారం పురపాలక శాఖ, జీహెచ్‌ఎంసీ తరపు న్యాయవాదులు కృష్ణారెడ్డి, రవీందర్‌రెడ్డి కోర్టుకు హాజరై వాదనలు వినిపించారు. జాప్యమెందుకు జరిగింది? కౌన్సిల్‌ను రద్దు చేస్తే సరిపోతుంది కదా? అని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. సమగ్ర వివరాలతో రావాలని ఈ నెల 12వ తేదీకి న్యాయస్థానం వాయిదా వేసింది.

### నేడు అన్ని పార్టీల కార్పొరేటర్లతో సమావేశం

కౌన్సిల్ ఏర్పాటు కోసం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రత్యేక చొరవ తీసుకొని సమావేశాన్ని నిర్వహించే దిశగా చర్యలు చేపట్టారు. ఈ మేరకు సోమవారం జీహెచ్‌ఎంసీ సెక్రటరీ లక్ష్మిని మేయర్ పిలిపించుకుని కార్పొరేటర్లకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. దీంతో మంగళవారం ఉదయం 11.30 గంటలకు అన్ని పార్టీల కార్పొరేటర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. మేయర్ అధ్యక్షతన జరిగే అఖిల పక్ష సమావేశంలో అన్ని పార్టీల నుంచి ప్రశ్నలు, సమావేశ ఏర్పాటు తేదీ, ఏ ఏ సమస్యలపై చర్చించాలన్న అంశంపై చర్చించనున్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ ఏర్పాటు చేసే దిశగా సన్నాహాలు చేస్తున్నారు.

## మేడారం జాతరకు 2200 సిటీ బస్సులు

**ఆరు రోజుల పాటు నగరంలో 450 బస్సులే..**

**నిర్ణయం తీసుకున్న ఆర్టీసీ యాజమాన్యం**

సిటీబ్యూరో, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ) : ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహిస్తున్న మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు సిటీ బస్సులను కేటాయిస్తూ ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయం తీసుకున్నది. గ్రేటర్ హైదరాబాద్‌లో సిటి ప్రయాణికుల కోసం తిరిగే 2650 బస్సులలో 2,200 సిటీ బస్సులు మేడారం జాతరకు కేటాయించారు. దీంతో ఈ నెల 20 నుంచి 25 వరకు నగరంలో మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు, ఆర్డీనరీ బస్సులు కనిపించే ప్రసక్తే ఉండదు. కేవలం నగరంలో ఉన్న అద్దె బస్సులే ఉంటాయి. దీంతో ఆ ఆరు రోజుల పాటు నగర ప్రయాణికులు తమ గమ్య స్థానాలకు చేరుకోవడానికి అనేక ఇక్కట్లు ఎదుర్కొనక తప్పదని తెలుస్తుంది. మరో వైపు హైదరాబాద్, సికింద్రాబాద్ వంటి గ్రేటర్ జోన్ నుంచి కూడా లక్షల సంఖ్యలో మేడారం జాతరకు వెళ్లే భక్తులకు ఆర్టీసీ ప్రత్యేక బస్సుల పేరుతో అదనపు చార్జీలు వసూలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదనపు చార్జీలు వసూలు చేసే అంశం ప్రభుత్వం ప్రభుత్వ పరిశీలనలో ఉందని, త్వరలోనే దీనిపై స్పష్టత వస్తుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు.



మంచిరేవుల ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో నేచర్ క్యాంప్‌లో నైట్ ట్రెక్కింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

## ప్రకృతి ఒడిలో ఒక రోజు

**మంచిరేవుల ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో నేచర్ క్యాంప్**

మణికొండ, ఫిబ్రవరి 5: రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎకో టూరిజం కార్యక్రమంలో భాగంగా మణికొండ మున్సిపాలిటీ మంచిరేవుల ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో సరోజిని నాయుడు వనిత మహా విశ్వవిద్యాలయ కళాశాల(ఎనిమల్ వెల్ఫేర్ క్లబ్) విద్యార్థులు ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సోమవారం ఉదయం 11 గంటల వరకు నేచర్ క్యాంప్ నిర్వహించారు. ఎకో టూరిజం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎకో టూరిజం ప్రాజెక్ట్స్ మేనేజర్ కళ్యాణపు సుమన్ తదితరులు హాజరయ్యారు. నేచర్ క్యాంప్‌లో పాల్గొనాలనుకునే వారు 9493549399, 9346364583లలో సంప్రదించాలని టీఎస్‌ఎఫ్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్‌నాయక్ కోరారు. ఈ కార్యక్రమంలో ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మారెడ్డి, శ్రీకాంత్, భాస్కర్, టీఎస్‌ఎఫ్‌డీసీ సిబ్బంది బాబు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డు ఉంటేనే గృహ జ్యోతి

**నేటి నుంచి లబ్ధిదారుల గుర్తింపు**

సిటీబ్యూరో, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ) : గృహ జ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు మంగళవారం నుంచి క్షేత్ర స్థాయిలో మీటర్ రీడింగ్ తీసే సిబ్బందితో లబ్ధిదారులను గుర్తించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఇంటింటికీ కరెంటు మీటర్ రీడింగ్ తీసే సిబ్బంది వచ్చి ఇంటి యజమానుల నుంచి రేషన్ కార్డు, ఆధార్ కార్డు నంబర్లతో పాటు మొబైల్ నంబర్‌లను తీసుకోనున్నారు. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్‌ఎస్‌పీడీసీఎల్) పరిధిలోని గ్రేటర్ హైదరాబాద్‌లో మొత్తం గృహ వినియోగ విద్యుత్ కనెక్షన్లు 52 లక్షల వరకు ఉంటే అందులో సుమారు 30 లక్షల లోపు వినియోగదారులు 200 యూనిట్ల విద్యుత్‌ను వినియోగిస్తున్నట్లు సమాచారం.



డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

## 2 నెలలుగా జీతాల్లేవ్!

**ఆశవర్కర్లు, ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు ధర్నా**

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 5: రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట సోమవారం తెలంగాణ ఆశ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో 1080 మంది ఆశవర్కర్లు, ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు ధర్నా నిర్వహించారు. అనంతరం డీఎంహెచ్‌వో అందుబాటులో లేకపోవడంతో ఆఫీసు సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఆశ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు జి.కవిత మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి నెలా 1వ తేదీన వేతనాలు చెల్లిస్తామని చెప్పి, రెండు నెలలుగా అమలు చేయడంలో విఫలమైందన్నారు. వెంటనే వేతనాలు చెల్లించకపోతే పీహెచ్‌సీ సెంటర్లలో విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి లలిత, జిల్లా ఉపాధ్యక్షులు శైలజ, ఆశ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పంజాగుట్ట మాజీ సీఐ దుర్గారావు అరెస్టు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 5 : పంజాగుట్ట మాజీ సీఐ దుర్గారావును అరెస్టు చేశారు. బోధన్ మాజీ ఎమ్మెల్యే కొడుకు కేసును తారుమారు చేసేందుకు యత్నించడంతో ఉన్నతాధికారులు అతన్ని డిసెంబర్ 26న సస్పెండ్ చేశారు. డిసెంబర్ 29 నుంచి దుర్గారావు పరారీలో ఉన్నాడు. ఇదే కేసులో నిందితుడిని తప్పించేందుకు యత్నించిన బోధన్ సీఐ ప్రేమ్‌కుమార్‌ను గత నెల 28న అరెస్టు చేశారు. నిందితుడు రాహిల్ అమీర్‌కు సహకరించడంతో పాటు కేసును డైవర్ట్ చేసేందుకు ప్రేమ్ కుమార్, దుర్గారావులు నిందితుడి బంధువుల నుంచి బేరసారాలు చేసినట్లు గుర్తించారు. పోలీసు ప్రత్యేక బృందాలు ఏపీలోని గుంతకల్లు వద్ద దుర్గారావును అరెస్టు చేసి వెస్ట్ జోన్ డీసీపీ కార్యాలయానికి తరలించి విచారిస్తున్నట్లు సమాచారం.



**ప్రయాణం.. నరకం** ▸ మాసబ్ ట్యాంక్ రోడ్‌లో సోమవారం ట్రాఫిక్ జామ్‌తో వాహనదారుల ఇబ్బందులు